www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 9 అక్టోబర్ 2023

5

తిరుపతి

ఇక నుంచి తిరుపతి రోడ్లపై

డబల్ డెక్కర్ బస్సులు.. రయ్.. రయ్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి వాసులకు డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. పలు పర్యాటక ప్రాంతాలను చుట్టివచ్చేలా ప్రత్యేక రూట్‌ను తిరుపతి నగరపాలక సంస్థ సిద్ధం చేసింది. తిరుపతి అందాలను ఆస్వాదిస్తూ రెండంతస్తుల బస్సుల్లో ప్రయాణం చేయడం ఒక గొప్ప అనుభూతిగా ఉండనుంది. నగరవాసులతో పాటు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను, సందర్శకులను సైతం విశేషంగా ఆకట్టుకొనే విధంగా ఉన్న డబుల్ డెక్కర్ బస్సులున్నాయి. పర్యావరణ హితం, కాలుష్య నివారణతో పాటు ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించేందుకు తిరుపతి నగరపాలక సంస్థ ఈ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతేకాకుండా నగరంలో డబల్ డెక్కర్ ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ప్రారంభించడంతో పాటు త్వరలో మరిన్ని బస్సులు అందుబాటులోకి తీసుకురానున్నది. డిప్యూటీ మేయర్ అభినయ్ చొరవ మేరకు అత్యాధునిక సాంకేతిక సామర్థ్యంతో రూపొందించిన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్‌లు అందుబాటులోకి వచ్చాయి. నగరంలో ట్రయిల్ రన్ చేసిన కొత్త బస్సును భూమన అభినయ్ పరిశీలించారు. ప్రైవేట్ బస్సులకు దీటుగా అత్యాధునిక సౌకర్యాలతో ఈ బస్సు తీసుకువచ్చారు. నగరానికి వచ్చిన వారు వాటిని ఆసక్తిగా చూడటమే కాదు అందులో ప్రయాణించి ప్రత్యేక అనుభూతిని పొందవచ్చు. ఈ బస్సుల్లో ప్రస్తుతానికి జర్నీ ఫ్రీ, టికెట్ అవసరం లేకుండానే ప్రయాణం చేయవచ్చు. వారం రోజుల తర్వాత మినిమం ఛార్జీ విధించే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఒక్కో ట్రిప్పుకు ఒక్కొక్కరి నుంచి రూ.50లు మాత్రమే వసూలు చేసే అవకాశం ఉంది. వీటిని చూసేందుకు కూడా జనాలు అమితాసక్తిని కనబరుస్తున్నారు. పర్యాటకుల స్పందన బట్టి మరిన్ని బస్సులు తీసుకువచ్చే ఆలోచనలో తిరుపతి నగర పాలక సంస్థ ఉంది.

జగన్ చెరలో

'ప్రజాస్వామ్యం' ఖూనీ: టీడీపీ

వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జగన్ చెరలో చిక్కుకుని ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందంటూ టిడిపి నాయకులు మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న నియంతత్వ, నిరంకుశ ధోరణి వల్లే ప్రజాస్వామ్యానికి ఈ గతి పట్టిందంటూ ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆ పార్టీ నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాజమండ్రి కేంద్ర కారాగారం నమూనాను ఏర్పాటు చేసి, అందులో బంధింపబడ్డ రిమాండ్ ఖైదీలుగా తమ నిరసన తెలియజేశారు. నాపై కేసులున్నాయి. ఖైదీ నెంబర్ ఉంది. మరి చంద్రబాబుకు కూడా కేసులు, ఖైదీ నెంబర్ ఎందుకు ఉండకూడదన్న రాజకీయ దురుద్దేశంతో జగన్ పోలీస్ వ్యవస్థని అడ్డుపెట్టుకొని బాబుని అన్యాయంగా జైల్లో పెట్టించారని నాయకులు వాపోయారు. ఈ కేసులో బాబుకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేకున్నా కాలయాపన చేస్తూ టిడిపిని దెబ్బతీసే కుట్ర చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎవరెన్ని కుట్రలు చేసినా చంద్రబాబు మచ్చలేని చంద్రుడిలా బయటకు వస్తారంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. గాలి చలపతి నాయుడు, విజయ్ కుమార్ నాయుడు, దశరథ ఆచారి, కాసరం రమేష్, చెంచయ్య నాయుడు, మునిరాజా నాయుడు, రేణుకమ్మ, మిన్నల రవి పాల్గొన్నారు.

ముక్కంటి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన రేబల ముత్తు రజనీకాంత్ రెడ్డి పేరున ప్రసన్నాంబ అనే భక్తురాలు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ.సాగర్ బాబు ఈ విరాళం స్వీకరించారు. దాతకు కతజ్ఞతలు తెలియచేసి దర్శనఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆర్డీవో కేఎస్ రామారావు బదిలీ

కనకదుర్గ ఆలయ ఈవోగా నియామకం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆర్డీవో కేఎస్ రామారావును బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ శాఖ నుంచి దేవదాయశాఖకు పంపుతూ విజయవాడ కనకదుర్గ ఆలయ కార్య నిర్వహణాధికారిగా నియమించింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. కేఎస్ రామారావు ఆర్డీవోగా చాలా మంచి పేరు తెచ్చుకుని ప్రజల మన్ననలు పొందారు. గతంలో ఈయనకు శ్రీశైలం భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి ఆలయ ఈవోగా పని చేసిన అనుభవం ఉంది.

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ

రిజిస్ట్రార్‌కి మలేషియా యూనివర్సిటీ ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని మలేషియాలోని తెరాంగు యూనివర్సిటీలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆహ్వానం అందింది. ఈ నెల 9 నుంచి 11 వరకు మలేషియాలోని యూనివర్సిటీ మలేషియా తెరాంగులో జరగనున్నటువంటి 'ఫుడ్ సస్టైనబిలిటీ మరియు సెక్యూరిటీ' అనే అంశంపై అను అంతర్జాతీయ సదస్సులో 10వ తేదీ పాల్గొని ప్లీనరీ స్పీకర్‌గా వక్తలను ఉద్దేశించి ప్రధానోపన్యాసం ఇవ్వనున్నారు. అదేవిధంగా పానల్ డిస్కషన్, ఇంటరాక్షన్‌లో పాల్గొని బోతున్నారు. యూనివర్సిటీ మలేషియా తెరంగు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆహ్వానాన్ని అందించారు. ఈ సందర్భంగా మహిళా విశ్వవిద్యాలయం వర్సిటీ అధ్యాపకుల సంఘం నేతలు ఆచార్యులు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు

మంత్రికి ఆహ్వానం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ : త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జునకు నెరవేకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రి ఆదివారం తిరుపతికి విచ్చేసిన సందర్భంగా తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వై.ప్రవీణ్ పుష్పగుచ్ఛని బహకరించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 15వ తేదీ జరగబోయే మొట్టమొదటి కరాటే రాష్ట్ర పోటీలకి మంత్రిని ఆహ్వానించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ రత్నకుమార్, వెంకటేశ్వర్లు, జీవరత్నం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లకు హెచ్చరిక

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ఐసీసీ వన్డే క్రికెట్ ప్రపంచ కప్-2023 ప్రారంభమైన నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి హెచ్చరిక జారీ చేశారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయక ప్రజలను, యువకులను లక్ష్యంగా చేసుకొని, అనతి కాలంలోనే ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని, ఆశలు రేకెత్తించేలా అమాయకులను ప్రేరేపించి మోసం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బందాలను ఏర్పాటు చేసి విస్తతంగా తనిఖీలు నిర్వహిస్తూ, అనుమానిత ప్రాంతాలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తూ నిఘా పెంచడం జరిగిందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చనే ఆశ చూపించి అమాయక ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించబోమన్నారు. ఏపీ జూద చట్టం-1974 (చట్ట సవరణ 2020) ప్రకారం కేసులు నమోదు చేయడమే కాకుండా, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసి వారి కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తిరుపతి జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు ప్రజలకు తెలిస్తే డయల్ 100కు సమాచారమివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు. తాను శ్రమించకుండా వచ్చే నగదు వెనుక అనేక కష్టాలు, నష్టాలు దాగి ఉంటాయని యువత గుర్తెరగాలని, అనవసరంగా కేసుల్లో నిందితులుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎత్తు పలికారు. తమ తల్లిదండ్రుల కోసం, తమ ఆశయాల సాధన కోసం ఉన్నతంగా బ్రతకాలని ఆకాంక్షించారు. బెట్టింగ్ రాయుళ్ళ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే క్రికెట్ బెట్టింగ్ నిర్వహించాలని చూస్తే ఎంతటి వారినైనా వదిలి పెట్టే ప్రసక్తే లేదని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

రోజా తీరు మహిళా లోకానికే మచ్చ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

రాష్ట్ర మంత్రి ఆర్‌కే.రోజా మహిళా లోకానికే మాయని మచ్చనితిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. మంత్రి రోజాను మాజీమంత్రి బండారు సత్యనారాయణ అసభ్యంగా మాట్లాడారని ఆమె దొంగ ఏడుపులు ఏడుస్తోందన్నారు. ఈమెకు సినీ మహిళా నటులు శ్రీరెడ్డి, కవిత, కుష్బు, రాధిక, రమ్యకష్ణ, పార్లమెంట్ సభ్యురాలు నవనీత్ కోర్ అండగా ప్రకటనలు ఇచ్చారన్నారు. వీరిని తాను తప్పుగా మాట్లాడటం లేదన్నారు. మహిళలుగా వీరు ఓ మహిళకు మద్దతు ఇవ్వడంలో తప్పులేదన్నారు. అయితే మంత్రి రోజా గతంలో టీడీపీ వారిని గురించి మాట్లాడిన అసభ్యకర మాటలు వీరు గుర్తు తెచ్చుకుంటే బాగుంటుదన్నారు. రాజకీయాలతో సంబంధం లేని నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణిని గురించి రోజా అసభ్యకరంగా మాట్లాడినపుడు వీరంతా ఏమయ్యారని చక్రాల ఉష ప్రశ్నించారు.

కరెంట్ ఛార్జీల పెంపు దారుణం

నేడు వామపక్షాల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలను విరమించుకోవాలని కోరుతూ సోమవారం గాంధీ విగ్రహం ఎదుట సిపిఎం, సిపిఐ నేతృత్వంలో నిరసన వ్యక్తం చేయనున్నట్లు ఆదివారం సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వాడ గంగరాజు, నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యుత్ వినియోగదార్లు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

- ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళికృష్ణ

రైతు సేవలో వ్యవసాయశాఖ..

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రైతుల సంక్షేమం ప్రభుత్వ పథకాలతో చేయూత, సాగుకు సహకారం అందించడం వ్యవసాయశాఖ లక్ష్యం ఇందు కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖరీఫ్, రబీ సాగు రైతులకు సలహాలు, సూచనలు అందించడంతో పాటు ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకొనేలా వ్యవసాయశాఖ కృషి చేస్తోంది. జిల్లాలో వేరు ఖరీఫ్‌లో వేరుశనగ సాగు అధికశాతం ఉంటుంది. తూర్పు మండలాల్లో వరి సాగు విస్తీర్ణం ఎక్కువశాతం ఉంటుంది. ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. నేడు ప్రభుత్వం వ్యవసాయ అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోని రైతులు అభివృద్ధి చెందాలని ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూ లో జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళికృష్ణ సూచించారు.

ప్రజాశక్తి : ఈ ఏడాది రబి సాగు ఎంత?

జేడి: ఈ ఏడాది రబీ 2023 సీజన్‌లో 1,38,738 హెక్టార్లు (చిత్తూరు-29026, తిరుపతి- 96204, అన్నమయ్య-13508) సాధారణ విస్తీరంగాను, 1,08,211 హెక్టార్లు (చిత్తూరు-19,226, తిరుపతి-8,186, అన్నమయ్య- 10,799) సాగు అయ్యింది.

వ్యవసాయశాఖ జెడి మురళికృష్ణ

ప్రజాశక్తి : ఈ క్రాపు బుకింగ్ ఏ మేరకు పూర్తి చేశారు?

జేడి: ఖరీఫ్ 2022 సీజన్‌లో 2,69,751 (చిత్తూరు- 1,96,831, తిరుపతి- 45,082, అన్నమయ్య-69,394) మంది రైతులు, 11,02,606 ఎకరాలు (చిత్తూరు-3,49,353, తిరుపతి- 1,05,000, అన్నమయ్య- 145903). రబీ 2022- 23 సీజన్‌లో 1,08,962 (చిత్తూరు-46,104, తిరుపతి- 37,901, అన్నమయ్య -24,957) మంది రైతులు, 1,82,300 ఎకరాలు (చిత్తూరు- 62,209, తిరుపతి-79,252, అన్నమయ్య -40839) ఈ-క్రాపు బుకింగ్ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా, పియం కిసాన్ ఎంత మంది రైతులకు అందించారు?

జేడి: 2022-23 సంవత్సరంలో రైతు భరోసా 4,39,167 రైతు కుటుంబాలకు (చిత్తూరు- 2,23,092, తిరుపతి- 1,03,732, అన్నమయ్య- 1,12,343) రూ.330.67కోట్లు (చిత్తూరు- 166.64కోట్లు, తిరుపతి 79.12కోట్లు, అన్నమయ్య 84.91 కోట్లు) రైతుల ఖాతాలకు జమ జేయటం జరిగింది. అలాగే పియం. కిసాన్ 2022-23 సంవత్సరం 4,21,815 రైతు కుటుంబాలకు (చిత్తూరు-2,22,374, తిరుపతి- 88,825, అన్నమయ్య - 1,10,816) రూ.242.18 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: వైఎస్ఆర్ సున్నా వడ్డీ ద్వారా ఎంత మంది రైతులు ప్రయోజనం పొందారు?

జేడి: వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు 2021 సంవత్సరంకు సంబందించిన 48,395మంది రైతులకు (చిత్తూరు 91,777, తిరుపతి 3,909, అన్నమయ్య 12,709), రూ.62.24 కోట్లు (చిత్తూరు 8.47కోట్లు, తిరుపతి 0.82కోట్లు, అన్నమయ్య 2.95కోట్లు) వడ్డీ రాయితీ రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగింది.

'ఎమరాల్డ్స్'లో ఘనంగా ఎలివేట్- 23 పోటీలు

విద్యార్థుల్లోని సజనాత్మకతను వెలికితీయడానికే - విశ్వనాథ్

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

విద్యార్థుల్లో దాగివున్న సజనాత్మకతను వెలికి తీసి భవిష్యత్తులో వారు ఉన్నత లక్ష్యాలు చేరుకోవడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయని ఎమరాల్డ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ విశ్వనాథ్ అన్నారు. ఆదివారం తిరుపతి నగర పరిధిలోని నరసింహతీర్థం మార్గంలోని ఎమరాల్డ్స్ కళాశాలలో కామర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తతీయ సంవత్సరం విద్యారుల సజనాత్మకతను వెలికి తీయడానికి ఏలివెట్-23 పేరుతో యాడ్ వార్, క్విజిట్, పికాసో, జంక్ యార్డ్, స్పీక్ అప్, స్టాక్ బజ్ తదితర విభాగాల్లో 400 మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు డిగ్రీ కళాశాల సంచాలకులు మునిరత్నం తెలిపారు. స్పీక్ అప్‌లో ప్రథమస్థానంలో పి.మోహిత్, ద్వితీయ స్థానంలో శోభ, క్విజిట్‌లో ప్రథమస్థానంలో పీయూష్, నీరజ్, నిఖిల్, ద్వితీయస్థానంలో చరణ్ కుమార్, నావిశేఖర్, హేమంత్, యాడ్ వార్ లో ప్రథమస్థానంలో సూర్యవిగ్నేష్, వంశీకష్ణ, ద్వితీయస్థానంలో శ్రీసాయిశ్రావణి, అనూష, స్టాక్ బజ్‌లో ప్రథమస్థానంలో పియూష్, నీరజ్, ద్వితీయస్థానంలో బాలనరేంద్ర, లోకేష్, పికాసో లో ప్రథమస్థానంలో శ్రీసాయిశ్రావణి, భవ్యశ్రీ, ద్వితీయ స్థానంలో సాయివందన, లావణ్య, జంక్ యార్డ్‌లో ప్రథమస్థానంలో కమల్, ద్వితీయస్థానంలో కళ్యాణి విజేతలుగా నిలిచారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక జ్ఞాపికలను అందించారు. ఈకార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి డాక్టర్ రమేష్, డాక్టర్ సుధాకర్, జాషువా, భాను కిరణ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భవ్యశ్రీకి అవార్డును అందిస్తున్న విద్యాసంస్థల డైరెక్టర్ విశ్వనాథ్

ఆంధ్రప్రదేశ్ మెడికల్, సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్

56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ మెడికల్, సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ 56వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా తిరుపతి సుందరయ్యనగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికచట్టాలు మార్పులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, యాజమాన్యాలు డిజిటలైజేషన్ తీసుకొని వచ్చి కార్మికుల మీద విపరీతమైన పనిభారాలను మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, యాజమాన్యాలు దాడులు ఈ మధ్యకాలంలో ఎక్కువైపోయాయి దీనివల్ల సేల్స్ రిప్రెంటేటివ్ తట్టుకోలేక కార్మికులు చాలా మంది మరణిస్తున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యాలు కార్మికులపై దాడులను వ్యతిరేకిస్తూ నవంబర్ 30వతేదీ ఒకరోజు దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రాజేష్, రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట నాగవెంకటేష్, యూనియన్ నాయకులు చిరంజీవి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పైళ్ల సుభాషిణి రెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యావిభాగం పరిశోధన విద్యార్థిని పైళ్ల సుభాషిని రెడ్డికి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విశ్వవిద్యాలయ విద్యావిభాగం ఆచార్యులు టంగుటూరి శిరీష మార్గదర్శకత్వంలో 'సబ్జెక్టు ఓరియంటెడ్ ప్రాక్టీసెస్ ఇన్ మ్యాథమెటిక్స్ ఇన్ రిలేషన్ టు అచీవ్మెంట్ ఎమాంగ్ ఎయిత్ అండ్ నైన్త్ క్లాస్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను ఆమెకి డాక్టరేట్ అవార్డును ప్రధానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ జీవన జ్యోతి తెలిపారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జనరల్స్‌లో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. సుభాషిణికి డాక్టరేట్ అవార్డు రావడం రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: కెవిపిఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంక్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ జెండాను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పుట్టా శంకరయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో దళితులపై దాడులను తిప్పికొడుతూ ఎన్నో పోరాటాలు చేస్తూ దళితుల పక్షాన కెవిపిఎస్ నిలిచిందని అన్నారు. దళితుల హక్కుల రక్షణ కోసం కెవిపిఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. నాయకులు రామిరెడ్డి, మణి, సురేష్, చంద్రయ్య, పార్థసారథి, చిరంజీవి, ప్రశాంత్, రాజా, పోలయ్య, తరుణ్, అనీష్ కుమార్ పాల్గొన్నారు.

డ్యూరో ప్లై భాగస్వాములకు సత్కారం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: భారతదేశ ప్రీమియం, అత్యంత అనుభవం కలిగిన ప్లైవుడ్ తయారీ సంస్థ, ప్రముఖ సంస్థలలో ఒకటైన డ్యూరోప్లై 'డ్యూరో లెజెండ్' కార్యక్రమంలో దక్షిణ భారత దేశానికి చెందిన నైపుణ్యం కలిగిన భాగస్వాములను సత్కరించింది. డ్యూరోప్లైకి చెందిన ఈ లెజెండ్ స్కిల్ పార్టనర్‌లలో చాలా మంది తరతరాలుగా కంపెనీతో ఉన్నారు. ప్లైవుడ్, బ్లాక్ బోర్డ్‌లు, డోర్‌ల ప్రీమియం శ్రేణికి డ్యూరోప్లై ఎంతో మన్నన పొందింది. ఇది ఇప్పటికే ఉత్తర భారతదేశంలో ప్రముఖసంస్థగా ఉంది. దక్షిణ, తూర్పు, పశ్చిమ భారతదేశంలో కంపెనీ చాలా వేగంగా అభివద్ధి చెందుతోంది. మన్నిక, నాణ్యతకు సంబంధించి డ్యూరోప్లై ఎంతో ఖ్యాతిని సంపాదించింది. ఈ సందర్భంగా డ్యూరోప్లై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అఖిలేష్ చిట్లాంగియా మాట్లాడుతూ "డ్యూరోప్లై ఒక బ్రాండ్‌గా ప్రీమియం నాణ్యతకు పర్యాయపదంగా మారిందన్నారు. దక్షిణ భారతదేశం అంతటా ఉన్న లెజెండ్‌లు ఒకచోట చేరి తమ విజయరహస్యాలు పంచుకు నే వేదికను అందించడం తమ లక్ష్యమని తెలిపారు. తద్వారా మొత్తం ఆవరణ వ్యవస్థకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. డ్యూరో లెజెండ్స్ వారి విధేయత, ప్రయత్నాలు, కషికి ప్రతిఫలం పొందారని, లెజెండ్ స్కిల్డ్ భాగస్వాములు కూడా ఈ గుర్తింపు పొందినందుకు తమ సంతప్తిని వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలోని ఇళ్లలో డ్యూరోప్లై ప్రీమియం ప్లైవుడ్‌ను విస్తతంగా స్వీకరించే దిశగా తమ ప్రయత్నాలను పునరుద్ధరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసంత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



ప్రజాశక్తి - ఏర్పేడు : మండలంలోని ఐఐటీలో కూల్ మేళా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలో విజేతలైన వారికి బహుమతులు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే స్కూల్ మేళ స్వచ్ఛంద సంస్థ ధ్యేయం. ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటి డీన్ ఎస్ ఎం మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి బహుమతులు అందించడం అభినందనీయమని తెలిపారు. స్కూల్ మేళ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఫౌండర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండే పిల్లలలో ఆత్మవిశ్వాసం సమాజసేవ సమాజం పట్ల అవగాహన కల్పించడం, తల్లిదండ్రుల లేని పిల్లలకు విద్యలో ప్రోత్సాహం అందించడం సింగల్ పేరెంట్స్ పిల్లలకు చదువులో ఎలాంటి అంతరాయం కలగకుండా సహాయపడటం ఉన్నత చదువు చదువుకునే వారికి ఆర్థిక స్తోమత లేకుంటే వారికి ఆర్థికంగా ప్రోత్సాహం అందించడం చేస్తున్నామని తెలిపారు. స్కూల్ మేళా ప్రతినిధి రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు దేశ చరిత్ర, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, స్వతంత్ర పోరాటాలు మనదేశంలో క్రీడారంగం, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, సైన్స్ పరిశోధనలు, శాస్త్రవేత్తలు, ప్రపంచ దేశాల క్రీడారంగం, రాజకీయ రంగం వివిధ అంశాలపై తిరుపతి జిల్లాలోని 50 కి పైగా పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారి నుండి 8 పాఠశాలలను తుది జాబితాలో తయారు చేసి ఐఐటీలో ఎస్ఎస్ఎస్ వారి సహకారంతో నిర్వహించి అందులో మూడు పాఠశాల విద్యార్థులను మొదటి బహుమతిగా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 25వేల రూపాయలు, రెండవ బహుమతి రేణిగుంట మండలం ఆర్ మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 15 వేలు రూపాయలు, మూడవ బహుమతిగా పెళ్లకూరు మండలం శిరసానంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 5 వేలు రూపాయలు, మిగిలిన పాఠశాల విద్యార్థులకు 1500 రూపాయలు అందించి మెమెంటో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఊరందూరు, మల్లవరం, శిరసనంబేడు, గోవర్ధనపురం, వొడ్డుపల్లి, వరదయ్య పాలెం, పల్లమాల, బి ఎన్ కండ్రిగ, ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ప్రతినిధులు రాజేష్, అరుణ కుమార్, హేమంత్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ మహేష్, వాలంటీర్లు నీలిమ, గోపి, స్నేహిత, దీక్షిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యమే కారణం?

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బాలకృష్ణ

ఆందోళన చేపట్టిన గ్రామస్తులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ట్రాన్స్ కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వారి విధులను అవగాహన లేమితో నిర్వర్తిస్తూ ఓ ప్రవేటు కూలీ విద్యుతు బలైపోయాడు. దీంతో ప్రయివేటు కూలీ భార్య, ఇద్దరు చిన్నారులైన కుమారుడు, కూతురు జీవనం కోల్పోయి వీధిన పడ్డారు. గతంలో పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరిగినా ట్రాన్స్ కో అధికారుల తీరు మారటం లేదని మండల ప్రజలు అంటున్నారు. వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతులు చేపడుతూ విద్యుత్ షాక్‌కు గురై ప్రైవేటు కూలీ యువకుడు తీవ్రంగా గాయపడి మృతి సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపాళెం దళితవాడకు చెందిన బాలకృష్ణ (28) విద్యుత్‌కు సంబంధించిన పనులు చేసుకుంటూ వచ్చే కూలీ డబ్బులతో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం, సపలమాల గ్రామానికి చెందిన ఓ రైతు పంట పొలాలలోని -ట్రాన్స్ ఫార్మరుకు విద్యుత్ రాకపోవటంతో బోరుమోటారు పనిచేయటం లేదని లైన్ ఇన్స్పెక్టర్ రవీంద్రకు ఫిర్యాదు చేశారు. దీంతో లైన్ ఇన్స్పెక్టరు రవీంద్ర బాలకృష్ణను వెళ్లి మరమ్మతులు చేయాలని తెలిపారు. బాలకృష్ణ పొలాల వద్దకు వెళ్లగా లైన్ ఇన్స్పెక్టరు రవీంద్ర పల్లమాల గ్రామంలోని సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసి ఆలత్తూరు, పల్లమాల ఫీడర్లకు ఎల్సీ కావాలని షిఫ్ట్ ఆపరేటర్ మనోహర్ కోరగా ఎల్సీ ఇచ్చారు. అయితే పొలాలలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాటూరు ఫీడర్లో ఉంది. దీంతో ట్రాన్స్ ఫార్మర్లో విద్యుత్ సరఫరా ఆగలేదు. ఇది తెలియని బాలకృష్ణ మరమ్మతుల కోసం ట్రాన్స్ ఫార్మర్ పైకి ఎక్కడంతో వెంటనే విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పల్లమాల సబ్ స్టేషన్‌లోనూ భారీ శబ్దం రావటంతో షిఫ్ట్ ఆపరేటర్ మనోహర్ విద్యుత్ నిలిపివేశారు. ఇది గమనించిన రైతులు ట్రాన్స్ ఫార్మర్ విద్యుత్ వైర్లలలో ఇరుక్కుపోయిన బాలకృష్ణను కిందకు దింపి శ్రీకాళహస్తిలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్సకోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఈ ఘటనకు ట్రాన్స్‌కో అధికారులు బాధ్యత వహించాలని కొత్తపాళెం గ్రామస్తులు సబ్ స్టేషన్ గేటు మూసి ఆందోళన చేపట్టారు. లైన్ ఇన్స్పెక్టరు రవీంద్ర చేయాల్సిన పనిని బాలకృష్ణ చేసి, ప్రాణాలను కోల్పోయాడని వాపోయారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గుడూరు పట్టణం లోని గమళ్ల పాలెం ప్రాంతంలో ఉన్న ఓం శ్రీ సాయి రాం వృద్ధాశ్రమంలో ఆదివారం శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ నిర్వాహురాలు కల్యాణి పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి చేయూత

కిడ్నీ బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని తూర్పు వీధి గిరిజన కాలనీ కి చెందిన పాముూరు వెంకటమ్మ నిరుపేద యువతి గత రెండు ఏళ్లుగా కిడ్నీ సంబంధించిన వ్యాధి తో పడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న మైత్రి అసోసియేషన్ మిత్రబృందం 7,700 రూపాయలను ఆదివారం బాధితురాలు ఇంటికి వెళ్లి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్నేహితుల సహకారంతో తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ దృక్పథాన్ని అలవరచుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే, ఎంపీ

ఎమ్మెల్యే, ఎంపీలకు గజమాలతో సన్మానిస్తున్న మన్నసముద్రం గ్రామస్తులు

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం మన్న సముద్రం గ్రామం లో ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్ రెడ్డి, ఎంపీ మద్దెల గురు మూర్తి లకు గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంటు సభ్యులు ఎం గురుమూర్తి స్వగ్రామమైన మన్న సముద్రం గ్రామంలో ఎమ్మెల్యే, ఎంపీలకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు, గృహ సారథలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి లేకుండా జీవించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రతి మనిషి మానసిక ఒత్తిడికి లోను కాకుండా సంతోషంగా జీవించాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని స్థానిక వాకర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య అధ్యక్షులు రామచంద్ర నాయుడు, గౌరవాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రవి రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎన్.బి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషి ప్రతిరోజు ఉదయం లేవగానే ఒక గంట పాటు నడవాలని వ్యాయామం చేయాలని అప్పుడే బీపీ షుగర్, హైపర్ టెన్షన్ వంటి వ్యాధులు నయమవుతాయన్నారు. మానసిక ఒత్తిడి ఎందువల్ల వస్తుందంటే పనిలో ఒత్తిడి ఉన్నప్పుడు వస్తుందన్నారు. ఆనందంగా నవ్వుతూ ఉన్నప్పుడు మానసిక ఒత్తిడి , బీపీ షుగర్ వంటి వ్యాధులు కూడా రావన్నారు. కష్టం వచ్చినప్పుడు కూడా ఒకరికొకరు ఆదుకుంటే మానసిక ఒత్తిడికి లోను కారని అప్పులు చేసినప్పుడు వారు వచ్చి ఏమంటారో తెలియదని మానసిక ఒత్తిడికి లోనవుతారని అలాంటివి లేకుండా ఉండాలన్నారు. అనంతరం ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ వారు రావిళ్ళ మాధవ నాయుడుని ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ గా ఎంపిక చేసినందుకు ఆయనను మానసిక వైద్య నిపుణులు ఎన్ బి సుధాకర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు రెడ, డాక్టర్ రవి రాజు, కోనేటి రవిరాజు చేతుల మీదుగా శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. సభ్యులు డాక్టర్ ఎన్‌బి సుధాకర్ రెడ్డిని ఘనంగా సత్కరించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషనన్ కార్యదర్శి రఘు, గోపికృష్ణ, ద్వారకనాథశెట్టి, కుప్పయ్య శెట్టి, మాజీ అధ్యక్షులు కే మురుగేషన్ రెడ్డి, వాకర్స్ మహిళ సభ్యులు పాల్గొన్నారు.

సభలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీబృందం..

సామాజిక తనిఖీ గ్రామ సభ సమావేశాలు

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని ఎండి పుత్తూరు , పాత వీరాపురం, రాజుల పాలెం, గుండ్ల కండ్రిగ , చినుపల్లి గ్రామ పంచాయతీలలో 16 వా రౌండ్ సోషల్ ఆడిట్ గ్రామసభ సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తనిఖీ అధికారి డిఆర్పి అనిల్ మాట్లాడుతూ ఎండి పుత్తూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులలో డిక్సన్ కంపెనీ వద్ద నాటిన చెట్లు చాలా బాగా పెరిగి ఆహ్లాదకరంగా ఉన్నాయని ఇందుకు సహకారం అందించిన సర్పంచ్ కందటి మోహన ప్రియకి , ఫీల్డ్ అసిస్టెంట్‌కి, ఉపాధి కూలీలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చేపట్టిన పనులలో ఎటువంటి అవకతవకలు జరగలేదని తనిఖీ అధికారి తెలిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌరీ, ఉపాధి హామీ ఏపీఓ దేవరి, టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్రుడు, పంచాయతీ కార్యదర్శి లోకముని,ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామల, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రహదారిపై మురుగు నీరు

పాదచారులకు తప్పని కష్టాలు

రోడ్డుపై ప్రవహిస్తూ పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్న మురుగునీరు..

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాలెం మండలం తగ్గువారిపల్లి పంచాయతీ అండారెడ్డిపల్లి గ్రామం బెంగళూరు మద్రాస్ జాతీయ రహదారి పై మురికి నీరు ప్రవహిస్తోంది. మురుగు నీరు ప్రవహించేందుకు సక్రమమైన కాలువలు లేక ఉన్న కొద్ది కాలువలలో వ్యర్థాలు అధికమై మురికి నీరంతా జాతీయ రహదారిపై ప్రవహిస్తోంది. పాదచారులకు దుర్వాసనతో రహదారి మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు పాదచారులు వాపోతున్నారు. నూతన మురికి కాలువ నిర్మించి మురికి నీరు పంపే విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోగా మురికినీరంతా జాతీయ రహదారిపై ప్రవహించడం పట్ల అనారోగ్యాల బారిన పడే పరిస్థితి ఎంతైనా ఉందని ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మురికి కాలువలను శుభ్రం చేసి మురికి నీరు ప్రవహించే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారిపై ఉందని పేర్కొంటున్నారు. గాంధీ జయంతి రోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు ఆర్భాటంగా ప్రారంభించారని, కాని మురికినీరు తొలగించేందుకు కాలువలను శుభ్రం చేయకపోగా కాలువలో వ్యర్థాలు అధికమై దోమల బెడద ఎక్కువగా ఉందని పరిసర కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మురికి నీరు కాలువలలో ప్రవహించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అంబేద్కర్ ఆశయాలను సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని డాక్టర్ కె.వి నాయుడు పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం ఉత్తరపు కండ్రిగకు చెందిన డాక్టర్ కె వి నాయుడు. డాక్టర్ వృత్తిలో విదేశాల్లో అమెరికాలో పనిచేస్తున్నారు. ఆయన ఉత్తరపు కండ్రిగ దళితవాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆయన సొంత నిధులతో ఏర్పాటుచేసి ఆదివారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేవీ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కులమత బేధాలు లేకుండా ఐకమత్యంతో మెలగాలని ఆయన ఆశయ సాధనల కోసం కృషి చేయాలని అన్నారు. యువకు లు అందరూ చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని తెలిపారు. ఎవరైనా చదువుకొని ఆర్థిక స్తోమత లేకుండా ఉన్న పిల్లలు ఇంకా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని వారు ఉంటే. వారికి ఆర్థిక సహాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో. సర్పంచి బుజ్జిబాబు. ఉపసర్పంచ్ ఉదయ్ కుమార్. సామాజిక కార్యకర్త నాగేంద్రరావు. అంబేద్కర్ ట్రస్ట్ కోశాధికారి కుప్పయ్య., సబ్ రిజిస్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాజేంద్ర, రవి నాయుడు, ప్రసాద్, యువకులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా యాదవ కార్పొరేషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన సుధాయాదవ్

హరీష్ కుమార్ యాదవ్ కు జ్ఞాపికను అందిస్తున్న తుంటి సుధా యాదవ్

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం అనంతపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా మంగళం రణధీరపురం గ్రామపంచాయతీ వైసీపీ నాయకులు తుంటి సుధా యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శ్రీవారి చిత్రపటాన్ని అందించారు. చైర్మన్ తో కేకును కట్ చేయించి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబు యాదవ్, కామాక్షి యాదవ్, మురగ యాదవ్, ముని యాదవ్, సమీర్ ఖాన్, నరసింహ పాల్గొన్నారు.

ప్రాచీన భారతీయ శాస్త్రీయ కళ భారత నాట్యం

- భరతనాట్య కళాకారులకు సర్టిఫికెట్లు అందజేత
- స్వచ్ఛంద్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ

అవార్డు అందుకుంటున్న చిన్నారి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మన దేశ కళ భరతనాట్యాన్ని నేటి తరం యువత, పిల్లలకు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న నాట్య గురువు మల్లికకు తమవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోణకా దేవ సేనమ్మ అన్నారు.గూడూరు పట్టణంలోని డీ.ఎస్.ఆర్ కమ్యూనిటీహాలులో జరిగిన కార్యక్రమంలో ఆమెతోపాటు డాక్టర్ రోహిణి పాల్గొని "అలిగిరీ నందిని" నృత్యంతో సరికొత్త ప్రపంచ రికార్డు నమోదు చేసిన చిన్నారులకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ లో శివ లలిత భరతనాట్య కళాక్షేత్రం సంస్థ అద్వర్యంలో భరతనాట్య కళాకారులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.గూడూరుకు చెందిన పిండి మల్లిక అధ్వర్యంలో శివ లలిత భరత నాట్య కళాక్షేత్రం సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిక ద్వారా శిక్షణ పొందిన కళాకారులు ఐసీఎండీఏ సంస్థ ద్వారా ప్రతిభ చాటి సరికొత్త ప్రపంచ రికార్డు నమోదు చేశారు. దీంతో స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ దేవసేనమ్మ, మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణిలు వారిని అభినందించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ మన దేశ సంస్కృతిలో భాగమైన భరతనాట్యాన్ని అభివృద్ధి పరిచేందుకు మల్లికా చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు మురళీక్రిష్ణ, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ముని గిరీష్,విశ్రాంత ప్రధాన అధ్యాపకులు, రచయిత టివిఎల్ ప్రసాద్,పిండి వెంకయ్య పాల్గొన్నారు.

ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా కరువు

రౌండ్ టౌబుల్ సమావేశంలో మేధావుల ఫోరం సభ్యులు

మాట్లాడుతున్న మేధావుల సంఘం సభ్యులు

ప్రజాశక్తి -రేణిగుంట : 'రాజ్యాంగ రక్షకులే ఒత్తిళ్లతో భక్షకులవుతున్నారు?' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం సభ్యులు పాత చెక్ పోస్ట్ సమీపంలోని కన్వెన్షన్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం సభ్యులు సమావేశం రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన మేధావులు, న్యాయవాదులు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, ఛార్టడ్ అకౌంటెంట్స్, రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ఎపిలో శాంతి భద్రతలు పూర్తిగా కరువయ్యాయని మేధావులు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, న్యాయ వాదులు అభిప్రాయపడ్డారు. న్యాయానికి సంకెళ్లు వేస్తున్నారని ఏ ఆధారాలు లేని స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని వక్తలు అభిప్రాయపడ్డారు. చంద్రబాబు ను నెలరోజుల పాటు జైలులో పెట్టడం బాధాకరమని న్యాయవ్యవస్థలను తప్పుదోవ పట్టిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. కక్షపూరితమైన వాతావరణం ఎపిలో నెలకొందని ఎపిలో రక్షకులే భక్షకులవుతున్నారని ఆరోపించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని పూర్తిగా అపహాస్యం చేస్తున్నారని రాజ్యాంగ పరిరక్షణపై కలిసికట్టుగా యుద్ధం చేయాలని అభిప్రాయపడ్డారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై మేధావులు ప్రశ్నించాలని మేధావులు మౌనంగా ఉంటే సమాజానికి కీడు చేసినట్లవుతుందన్నారు. చంద్రబాబు అరెస్టు చేసిన పద్ధతి సరైంది కాదని రాజకీయ ఒత్తిళ్ళతోనే అక్రమ అరెస్టులు జరుగుతున్నాయని భావిస్తున్నామని మేధావులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే వెంటనే కేసులు అరెస్టులు రాష్ట్రంలో జరుగుతున్నాయని ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న వారిపైన నాన్ బెయిలబుల్ కేసులు పెడుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో మేధావులు అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతి పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, లీగల్సేల్ నాయకులు ఉదయ్ కుమార్ రెడ్డి, వెంకటాపురం మాజీ ఎంపీటీసీ గజేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసి శివరాజుకు ఘననివాళి

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : సుపరిచితుడైన ప్రముఖ క్రషర్ యజమాని వేంపల్లి శివరాజు(72) శనివారం వయోభారంతో కన్ను మూశారు. ఆయన మృతికి. చిత్తూరు పార్ల మెంటరీ టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య. ఆదివారం తిరుమల కుప్పం రాజుల కండిగ గ్రామానికి వెళ్లి, మృతి చెందిన శివరాజు మృతి దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి వివరాలను అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, మాజీ సర్పంచ్ జయ శేఖర్, మోహన్ రాజు మహేష్, ఈశ్వర్, తదితరులు ఉన్నారు.

నాగవిహారికి డాక్టరేట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో స్టాటిస్టిక్స్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ఆర్ అబ్బయ్య పర్యవేక్షణలో 'స్టాటస్టికల్ క్రైటీరియా ఫర్ సెలక్షన్ ఆఫ్ ఫంక్షనల్ ఫార్మ్స్ ఇన్ రిగ్రేషన్ ఎనాలసిస్' అనే అంశంపై రీసెర్చ్ స్కాలర్ కె. నాగవిహారి తన థీసిస్ ను పూర్తి చేసుకొని డాక్యుమెంట్ సమర్పించారు. ఇందుకు గాను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ స్టాటిస్టిక్స్ డాక్టర్ ప్రదానం చేసినట్లు ఎస్వియూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రకటించారు.

ఆర్ఎం రఫీఉల్లాకు ఘన సన్మానం

ప్రజాశక్తి- రేణిగుంట : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్ రెడ్డిని రాబోవు ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి సైనికుల్లా పనిచేస్తామని వైసిపి ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఆర్ఎం రఫీఉల్లా తెలిపారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నూతనంగా వైసిపి ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆర్ఎం రఫీఉల్లా ను ముస్లిం మైనార్టీ నాయకులు మసీదు, పెద్దలు శాలువాతో సన్మానించి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆర్ఎం రఫీ ఉల్లా మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, వైసిపి మండల ఇంచార్జ్ బియ్యపు పవిత్ర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అఖండ మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని ముస్లిం మైనార్టీలు ఐకమత్యంతో వైసిపికి భారీ మెజార్టీని అందిస్తామన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ పార్టీ శ్రేణులను కలుపుకొని పోయి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, తారకరామా నగర్ ఇన్చార్జ్ మన్నెం శ్రీనివాసులురెడ్డి, ఎంజీ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రసూల్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, మిరియాల బాబా ఆశ్రమం పీఠాధిపతి జుబేర్ హయత్ ఖదిరి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ఆర్ఎం అమానుల్లా, మండల కో-ఆప్షన్ సభ్యులు సుభాన్ రాజా సేవలను కొనియాడుతూ మౌనం పాటించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, మైనార్టీ నాయకులు మెస్ బాబు, వైసిపి నాయకులు షమీవుల్లా, జిల్లా జాయింట్ సెక్రెటరీ గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ ఇరానీ ఖాదర్, మైనార్టీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, మైనార్టీ నాయకులు, వైఎస్ఆర్ పార్టీ జిల్లా యువజన కార్యదర్శి మిధున్ శాలి, జిలాని, సికిందర్, అక్బర్ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసన

ప్రజాశక్తి- వెంకటగిరి: నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా వెంకటగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్ ఇటీవల రెండు కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని, కడిగిన ముత్యంలా త్వరగా విడుదల కావాలనిచంద్రన్న కోసం చండీయాగం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రాన్ని బోడిగుండుగా మార్చిన ఈ జగన్మోహన్ రెడ్డికి నిరసనగా డాక్టర్ మస్తాన్ యాదవ్ ఆధ్వర్యంలో అరగుండు కార్యక్రమం నిర్వహించి చంద్రబాబుకుకి మద్దతు తెలిపారు. డాక్టర్ మస్తాన్ యాదవ్ వెంకటగిరి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ తో కలిసి నియోజకవర్గంలో 26 రోజులు పాటు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. చేయి చేయి కలుపుదాం - చంద్రన్నకు మద్దతు పలుకుదాం అనే కార్యక్రమం శ్రీకారం చుట్టారు. వెంకటగిరి పట్టణంలో 15 వ వార్డ్ గొల్లపాలెంలో వెలిసిన అంకమ్మని దర్శించుకొని పూజలు నిర్వహించి చంద్రబాబు త్వరగా విడుదల కావాలని కోరుకుంటూ. చేయి చేయి కలుపుదాం చంద్రన్నకు మద్దతు పలుకుదాం అని కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్ మస్తాన్ యాదవ్ స్థానిక 15వ వార్డ్ గొల్లపాలెం కావడంతో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని ప్రజలందరినీ ఆప్యాయంగా పలకరించి, స్థానిక టీడీపీ నాయకులతో, ప్రజలతో, కార్యకర్తలతో, స్నేహితులతో కలిసి గొల్లపాలెం అంతా తిరిగి బాబు అక్రమ అరెస్టును ప్రజలకు వివరించారు. చంద్రబాబు విడుదల చేసిన భవిష్యత్తు గ్యారెంటీ మినీ మేనిఫెస్టో గురించి తెలియజేస్తూ రానున్న 2024 వ ఎన్నికల్లో టిడిపి బలోపేతానికి కృషిచేయాలని కోరారు.

సమావేశం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

జనసేన కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి- గుడిపల్లి: జనసేన జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ ఆదేశా ల మేరకు కుప్పం నియో జకవర్గం గుడిపల్లి మండ లం లోని 50 మంది జనసైనికుల సమక్షంలో 18 గ్రామ పంచాయతీ కమిటీలు, కొన్ని పంచాయతీ ఇన్‌ఛార్జిలను నియమించారు. జనసేన క్రియాశీలక సభ్యత్వాలు, కిట్లు పంపిణీ, మండలంలోని జనసేన దిశ నిర్దేశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు అమీర్, జన సైనికులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE:TIRUPATHI
O.S.No. 122 of 2021

Smt. Battala Naga Lakshmi ...Plaintiff
Vs.
Battala Venkataramana And 2 others .....Defendants

SUIT SUMMONS TO THE DEFENDANT NO.3

TO :-
D. Deepthi Priya,
W/o P. Amarnath,
Door No. 1-5-599/5,
Balaji Colony,
Tirupati - 517501.

Please take Suit Summons that the above O.S.No. 122 of 2021 is posted to 02-11-2023 for your appearance before the above said Honourable Court at 10.30 A.M. either in person or through an Advocate and raise your objections, if any, failing which the case will be decided in your absence, as exparte.

Hg date: 02-11-2023

(By order of the court)
Sri. M. PRUDHVI RAJ,
K. SATHYANARAYANA,
ADVOCATES: HYDERABAD
Y. NAGARAJA, M.A., LL.B.,
ADVOCATE : TIRUPATI.
CELL : 8341943699

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE:TIRUPATHI
I.A.NO.351 OF 2021
O.S.No. 122 OF 2021

Smt. Battala Naga Lakshmi
@ Thanneru Naga Lakshmi .....Petitioner/Plaintiff
Vs.
Battala Venkataramana And 2 others .....Respondents/Defendants

NOTIC TO THE RESPONDENT NO.3

TO :-
D. Deepthi Priya, W/o P. Amarnath,
Door No. 1-5-599/5, Balaji Colony,
Tirupati - 517501.

Please take Notice that the above I.A.No.351 of 2021 in O.S.No.122 of 2021 is posted to 02-11-2023 for your appearance before the above said Honourable Court at 10.30 A.M. either in person or through an Advocate and raise your objections, if any, failing which the case will be decided in your absence, as exparte.

Hg date: 02-11-2023

(By order of the court)
Sri. M. PRUDHVI RAJ,
K. SATHYANARAYANA,
ADVOCATES: HYDERABAD
Y. NAGARAJA, M.A., LL.B.,
ADVOCATE : TIRUPATI.
CELL : 8341943699

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE:TIRUPATHI
I.A.NO.352 OF 2021
O.S.No. 122 OF 2021

Smt. Battala Naga Lakshmi
@ Thanneru Naga Lakshmi .....Petitioner/Plaintiff
Vs.
Battala Venkataramana And 2 others .....Respondents/Defendants

NOTIC TO THE RESPONDENT NO.3

TO :-
D. Deepthi Priya, W/o P. Amarnath,
Door No. 1-5-599/5, Balaji Colony,
Tirupati - 517501.

Please take Notice that the above I.A.No.352 of 2021 in O.S.No.122 of 2021 is posted to 02-11-2023 for your appearance before the above said Honourable Court at 10.30 A.M. either in person or through an Advocate and raise your objections, if any, failing which the case will be decided in your absence, as exparte.

Hg date: 02-11-2023

(By order of the court)
Sri. M. PRUDHVI RAJ,
K. SATHYANARAYANA,
ADVOCATES: HYDERABAD
Y. NAGARAJA, M.A., LL.B.,
ADVOCATE : TIRUPATI.
CELL : 8341943699

వాణిజ్య శాస్త్రంతో ఉన్నత కొలువులకు సువర్ణ అవకాశం

- ఎస్వీయూలో ఎంకామ్ 3 కోర్సులలో 165 సీట్లు
- ప్రతి ఏటా క్యాంపస్ ప్లేస్‌మెంట్లు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని వాణిజ్యశాస్త్ర విభాగంలో ఎం కామ్ కోర్సు పూర్తి చేయడం ద్వారా వివిధ వాణిజ్య రంగంలోని వివిధ విభాగాలలో ఉన్నత కొలువుతో సాధించేందుకు ఉత్తమమైన మార్గంగా ఉంటుందని మేనేజ్‌మెంటు కళాశాల ప్రిన్సిపాల్, కామర్స్ విభాగం సీనియర్ ఆచార్యులు పీవీ నర్సయ్య పేర్కొన్నారు. 'ప్రజాశక్తి' తో ఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని 2023 - 24 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2023 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వాణిజ్య శాస్త్రములో చేరి తరగతులు చక్కగా హాజరై కోర్సు పూర్తి చేసిన వెంటనే అనేక రంగాలలో ఉన్నతమైన ఉపాధి అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. వాణిజ్య శాస్త్ర విద్యలో చేరిన విద్యార్థులకు దేశంలోని వివిధ ఉన్నతమైన కంపెనీలలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఎస్వీయూలో కామర్స్ విభాగానికి ప్రత్యేకమైన భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. కామర్స్ విభాగానికి డిజిటల్ తరగతులు, ల్యాబ్ ఫెసిలిటీలు, క్రమ పద్ధతిగా తరగతుల నిర్వహణ, యాజమాన్యం నిర్వహణ మెలుకువలు, యాజమాన్య శిక్షణ, పద్ధతులు వంటి అంశాలపై అవగాహన సదస్సులు, సెమినార్లు డిబేట్లు నిర్వహిస్తున్నారు. ఎస్వీయూలో కామర్స్ విభాగంలో మూడు కోర్సులు వున్నాయన్నారు. ఎంకామ్ రెగ్యులర్ (జనరల్), 2. ఎం.కామ్ ఎఫ్ఎం (ఫైనాన్షియల్ మేనేజ్మెంట్) 3.ఎం.కామ్ ఎ అండ్ ఎఫ్ (అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్) కోర్సులు ఉన్నాయన్నారు. ఎం.కామ్ రెగ్యులర్ (జనరల్) కోర్సులో 50 సీట్లు, కన్వీనర్ కోటాలో 15 సీట్లు ఉన్నాయని, ఎఫ్ఎం కోర్సులో 50 సీట్లు, ఏ అండ్ ఎఫ్ లో 50 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. దేశంలో గాని, రాష్ట్రంలో కానీ విడుదల చేసే వివిధ రకాలైన రంగాలలో నోటిఫికేషన్లు ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో ఎస్ఎస్సి, రైల్వే బోర్డు, యుపిఎస్సి, దేశస్థాయిలో జాతీయ బ్యాంకుల వంటి నోటిఫికేషన్లు కామర్స్ రంగంలో ఉన్నత విద్యను చేసిన విద్యార్థులకు మంచి సువర్ణ అవకాశం గా పేర్కొన్నారు. అంతే కాకుండా కామర్స్ డిగ్రీ తో ఏపీపీఎస్సీ గ్రూప్ 1, 2, ఇతర పోటీ పరీక్షల్లో కూడా ఎం.కామ్ కోర్స్ అదనంగా ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్, వృత్తి విద్యా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, డిబేట్లు, సెమినార్ల కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంకా విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రాజెక్టు లో భాగంగా కొన్ని ఇండస్ట్రియల్ పార్కులు, ఫీల్డ్ ట్రిప్పులు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఎం.కామ్ చేసిన విద్యార్థులు పూర్తిస్థాయిలో రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభతో రాణిస్తున్నారని కొనియాడారు. పూర్వ విద్యార్థులు ఎంతోమంది దేశస్థాయిలో వివిధ రంగాల్లో ఉన్నతంగా రాణించడం సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులకు మంచి నైపుణ్య శిక్షణ, నైపుణ్యాలను కలిగించేందుకు ఉత్తమ అధ్యాపకులు బోధన, డిజిటల్ తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు కామర్స్ విభాగం ద్వారా ఒక మంచి ఆ ఫ్లాట్ ఫామ్, ఒక నరియైనదారి ఏర్పడి ఉన్నత రంగాల్లో రాణించేందుకు సహాయకారిగా ఎంకామ్ పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుందన్నారు. పీజీ సెట్ 2023 సెట్ లో ఎం.కామ్ ప్రవేశ పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థులు ఎస్వీ యూనివర్సిటీలోని ఈ మూడు కోర్సులలో ఏదో ఒక ఎంపిక చేసుకొని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.